


# ప్రేమించి చూడు

రావిపల్లి నారాయణరావు

"కాలేజీలో చదువుకునే రోజుల్లో నేనొక అమ్మాయిని ప్రేమించాను. ఆమె పేరు కస్తూరి. తలిదండ్రుల ఇష్ట ప్రకారం కస్తూరి తన మేనమామను పెళ్ళి చేసుకుంది. అందువలన కోరుకున్న స్త్రీని నేను పొందలేకపోయాను. అప్పటి నుండి పెళ్ళిచేసుకుని సంసార జీవితం సాగించాలన్న కోరిక నాకు కలగలేదు. నా మనస్సులోని భావాలు అర్థంచేసుకున్న నా తలిదండ్రులు పెళ్ళి చేసుకోవాలన్న వొత్తిడి తీసుకురాలేదు."

చెట్లతోపు పక్కన నావెంట నడుస్తూ




వచ్చిన చిన్ననాటి స్నేహితుడు త్యాగరాజు వైపు తిరిగాను. నేను చెప్పినదంతా శ్రద్ధగా వింటూ ఫాలో అవుతున్నాడు.

"మెడిసన్ పూర్తిచేసిన తర్వాత యీ ఏజెన్సీ ప్రాంతంలో ప్రాక్టీసు పెట్టాను. ఈ ఊళ్లో ప్రాక్టీసు పెట్టి ఏడు సంవత్సరాలైంది. ఇక్కడి ప్రజల్ని వాళ్ళ అలవాట్లను అవగాహన చేసుకోడానికి ఎంతోకాలం పట్టలేదు."

రెండడుగులు వెనకబడ్డ త్యాగరాజు కోసం ఒక క్షణం ఆగాను.

సిగరెట్ పొగను గుప్పుమని విడుస్తూ -"యస్ ప్రొసీడ్"- అంటూ ముందుకు వచ్చాడు త్యాగరాజు.

ఒకవైపు అంతుతెలియని అగాధాలు, మరోపక్క ఆకాశాన్ని అందుకోబోతున్న అశోకవృక్షాలు. ఆ రెండింటికీ నడుమ వున్న కాలిబాట గుండా మేము నడక సాగించాము.

"ఈ ఊళ్ళో ప్రాక్టీసుపెట్టిన కొత్తలో ఒకరోజు— ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకుని క్లినిక్ తలుపులు తెరిచి కిట్ బ్యాగ్ సర్దుకుంటున్నాను...

"గుడ్ మార్నింగ్ సార్!"- ఒక స్త్రీ కంఠం వినిపించింది.

"నా చెవులను నేను నమ్మలేకపోయాను అంతవరకు స్వచ్ఛంగా తెలుగు మాట్లాడే మనిషి ఒక్కడైనా కనబడని ఊర్లో ఇంగ్లీషు మాట్లాడే వ్యక్తి- పైగా ఆడగొంతు- ఎవరై ఉంటారా అని ఆశ్చర్యంగా వీధి గుమ్మానికి వ్రేలాడే కర్టెన్ తీసి బయటికి తొంగి చూసాను. ఆమెను చూడగానే కొన్ని క్షణాలు నా కనురెప్పలు నిశ్చలనంగా నిలిచిపోయాయి. అటువంటి సుందర విగ్రహాన్ని నేనంతవరకూ చూడలేదు. వయసులో ఉన్న మగువ కనుచూపులను తప్పించుకు తిరిగే నేను ఆమె చూపుల నుండి దృష్టిని మరల్చుకోలేకపోయాను.

"మీ...రు?" మెల్లగా అడిగాను.

"నా పేరు పార్వతి" ఆమె చెప్పింది.

"రండి. కూర్చోండి" ప్రక్కనున్న కుర్చీ చూపించాను.

"ఫర్వాలేదు. నేను ఇక్కడే కూర్చుంటాను." ఆమె మెట్లమీద కూర్చుంది.

నేను మాటలకోసం తడుముకుంటు

న్నానవి గ్రహించి ఆమె సంభాషణ ప్రారంభించింది.

"నా పేరు పార్వతి."

"చెప్పారు" అన్నాను.

"ఒక నర్సు కావాలని మీరు ఊర్లో విచారించారట. నేను పనికొస్తానేమో చూడండి" అంది పార్వతి.

"నర్సు ట్రైనింగ్ అయ్యారా?" అడిగాను.

"లేదు. అసలు నేను ఏ బడిలోను చదువుకోలేదు. మా నాయన ఇక్కడే ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తున్నప్పుడు ఆయన దగ్గరే ఇంగ్లీషు చదవను, రాయను నేర్చుకున్నాను. మందుసీసాల మీదున్న పొడి అక్షరాలు చదివి ఏ మందు ఎవరి కివ్వమంటే వారికివ్వ గలను."

"ఆమె మాటలు స్పష్టంగా ఉన్నాయి. ఎక్కువ చదువుకోకపోయినా, మంచి సంస్కారం ఉంది. నిజానికి అంత తొందరగా నర్సు అవసరం నాకు లేక పోయినా పార్వతిని చూడగానే డ్యూటీ లోకి తీసుకోకుండా ఉండలేకపోయాను. పార్వతిని ఉద్యోగంలోకి తీసుకున్న పది రోజుల్లోనే ఆమెను పెళ్ళిచేసుకోని జీవితం ఎందుకనిపించింది నాకు. నా అభిప్రాయం ఆమెకు తెలియపర్చటానికి చదువు, సంస్కారం అడ్డొచ్చాయి.

"ఒక రోజు డెలివరీ కేసు చూసుకుని చెట్లుచేమలు దాటుకుంటూ నా వెంట నడు చుకు వస్తున్న పార్వతి అడిగింది-

"ఈ కీకారణ్యంలో ఆసుపత్రి పెట్టి ఎందుకు కష్టాల్ని కొనితెచ్చుకున్నారు?"

"పెళ్ళి చేసుకోలేదు కదా! అందుకని"

వెనక్కి తిరిగి చిలిపిగా ఆమె ముఖం లోకి చూసాను.

"అంటే మీరు నిజంగా పెళ్ళిచేసుకో లేదా?"

"నిజంగానే పెళ్ళిచేసుకోలేదు-"


క్లినిక్ చేరుకునేవరకు పార్వతి మళ్లీ నోరు విప్పలేదు.

"పార్వతి క్లినిక్‌లో చేరి రెండు నెలలు పూర్తికావచ్చింది. మకాం కూడా క్లినిక్‌లోనే పెట్టింది. ఇద్దరం ఒకే చూరు కింద జీవితం సాగిస్తున్నాం. ఆమెకు నాపైన ఎంతో గౌరవం, అంతకు మించిన నమ్మకం ఉన్నాయి. వాటిని వమ్ము చేయటానికి నేను సాహ సించలేకపోయాను.

"ఒకరోజు బాగా పొద్దుపోయింది. దండకారణ్యం అంతా మంచి నిద్రలో ఉంది. ప్రక్కగదిలో ఒంటరిగా ఉన్న పార్వతి గదిలోకి ధైర్యంగా ప్రవేశిం చాను. బాగా చీకటిపడిన తర్వాత అల ఆమె గదిలోకి వెళ్ళటం అదే మొదటి సారి.

"గదిలో ప్రవేశించిన నన్ను చూసి మంచంమీద నడుంవాల్చిన పార్వతి గాబ రాగా లేచి కూర్చుంది.

గదిలోని చమురుదీపం నా గుండెలా రెపరెప కొట్టుకోసాగింది. గది తలుపులు



తెరవగానే లోనికి ప్రవేశించిన ఈదురు గాలి పార్వతి ఎత్తైన గుండెల మీదున్న పల్చటి పమిటతో దోబూచులాడుతోంది.

"పార్వతీ! నీ అనుమతి తీసుకోకుండా నీ గదిలోకి వచ్చినందుకు నన్ను క్షమించు. కాని నే నిలా వచ్చినందుకు నువ్వు భయపడక్కర్లేదు. నువ్విక్కడ వున్నంతవరకు నీకు ఎటువంటి హాని కలగదని నేను హామీ ఇస్తున్నాను. నా మనస్సులోని అభిప్రాయం నీకు తెలియపర్చకుండా ఉండలేకపోతున్నాను. ఆ విషయం నీకు తెలియపర్చటానికే నే నిక్కడకు వచ్చాను... పార్వతీ! పెళ్లి చేసుకోకూడదు అన్న నిర్ణయం నేను చాలాకాలం క్రిందట తీసుకున్నాను. కాని నిన్ను చూడగానే ఆ నిర్ణయాన్ని ఆచరణలో పెట్టలేకపోతున్నాను. నేను నిన్ను మనసార ప్రేమిస్తున్నాను. నన్ను పెళ్ళిచేసుకోమని నిన్ను కోరుకుంటున్నాను" అన్నాను నేను.

"డాక్టర్ బాబూ! మీరు చాలా మంచివారు. నాకు తెలుసు. కాని మీరు తీసుకున్న నిర్ణయం తొందరపాటుతో తీసుకున్నది. నా పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకుని ఉంటే మీరు అలాంటి నిర్ణయం తీసుకుని ఉండపోదురు" అంది పార్వతి.

"నాకు వాటితో పనిలేదు."

"మీకున్న అభిప్రాయాలతో మీ తలిదండ్రులు అంగీకరించకపోవచ్చు."

"పార్వతీ! నన్ను యింతేనా నువ్వు అర్థం చేసుకున్నది. మా తలిదండ్రులు నామాట కాదనరు, నా మాట నమ్ము."

రెండు చేతులతో పార్వతి భుజాల్ని పట్టుకుని నావైపు తిప్పుకున్నాను. కన్నీళ్ళతో ఆమె లేత చెక్కిళ్ళు తడిసిపోయాయి.

"పార్వతీ, నా మాటలు నీకు బాధ కలిగించాయా? అయామ్ వెరీ సారీ."

"లేదండీ... మీ మాటలు బాధ కలిగించలేదు. నాకు కొంచం వ్యవధి కావాలి" చెక్కిళ్ళు తుడుచుకుంది పార్వతి.

"ఏమాట నేనెందుకు కాదనాలి పార్వతీ!- టేక్ యువర్ ఓన్ టైమ్." అంటూ పార్వతి మంచంమీద నుండి లేచి నేను నా గదిలోకి వెళ్ళిపోయాను. నా మనస్సు చాలా తేలికపడింది. ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాను"—

"ఆ మరుసటిరోజు పెందరాళే లేచి చూచాను. పార్వతి అలికిడి కనబడలేదు. చుట్టుపక్కలా చూసాను. ఎక్కడా ఆమె జాడ తెలియలేదు." చెప్పాను నేను, త్యాగరాజు వైపు తిరిగి.

"చూడగా ఆమె పెద్ద కథనాయికలా ఉంది. ఆమె గత జీవితంలో అంటే నీ క్లినిక్‌లో చేరకముందు ఒక చరిత్ర సృష్టించి వుండొచ్చు. లేకపోతే నీతో చెప్పకుండా క్లినిక్‌ను విడిచి ఎందుకు వెళుతుంది?"

వ్యంగ్యంగా అన్నాడు త్యాగరాజు.

"ఐ డోంట్ బిలీవ్. ఆమె గుణం చాలా మంచిది. ఆ నమ్మకం నాకుంది" అన్నాను నేను.

నా ఫీలింగ్స్ చూసి త్యాగరాజు మళ్ళీ నోరు విప్పలేదు. ఇద్దరం ఇంటికి చేరేసరికి బాగా చీకటిపడింది. ఆ మర్నాడు త్యాగరాజు శలవులేదని వాళ్ళ ఊరు వెళ్ళిపోయాడు.

ఆరు సంవత్సరాల క్రిందట క్లినిక్ విడిచి వెళ్ళిన పార్వతి ముఖం మళ్ళీ కనిపించలేదు

అప్పుడప్పుడు పార్వతి తలపుకు వచ్చేది.

నిద్రపోతుంటే పార్వతి మాటల్ని తలచుకుంటుంటే ఎంతో హాయిగా ఉంటుంది.

పార్వతి క్లినిక్‌లో పనిచేస్తున్నప్పుడు దగ్గర్లో ఉన్న ఒక పల్లెలో జాతర జరుగుతోంది. ఊళ్ళోని జనం జాతర చూట్టానికి వెళ్ళారు. క్లినిక్‌లో పనిలేదు.

నేను ఈజీ చేర్‌లో కూర్చున్నాను. పార్వతి కబుర్లు చెబుతోంది...

"ఈ కీకారణ్యంలో రైలు పడినా ఎక్కువ ప్రజలు రైలు ప్రయాణానికి అలవాటు పడలేదు. నేను జైపూర్ వెళ్ళి తిరిగి వస్తున్నాను. ఆ రోజు జైపూర్ నుండి వాల్తేరు వెళ్ళే రైలు చాలా ఆలస్యంగా నడుస్తోంది. నేను జైపూర్ స్టేషన్‌లో రైలు ఎక్కేసరికి పెట్టెలో జనం బాగా ఉన్నారు. అయితే రెండుమూడు స్టేషన్లు దాటేక పెట్టెలో నేను ఒక్కర్తెనే మిగిలాను. పొద్దు పోయింది. ప్రపంచం అంతా చీకటి ఒడిలో నిద్ర తీస్తున్నట్టుంది. పెట్టెలో లైట్లు వెలగలేదు. చలిగాలి రివ్వున కొడుతోంది. కిటికీ తలుపులు మూసి దుప్పటి కప్పుకుని ఒక మూల కూర్చు న్నాను. అలా ఒక అరగంట గడిచిందో లేదో చీకటిలో బలమైన ఒక చేయి నా భుజంపై పడింది..." ఆ రోజు పార్వతి యింకా ఏమో చెప్పబోయింది. కాని ఆమె నోటికి అడ్డంగా నేను చేయి పెట్ట డంతో పార్వతి సంభాషణ ముందుకు కొనసాగలేదు.

* * *

త్యాగరాజు, నేను చిన్నప్పుడు కలిపి చదువుకున్నాం. చాలా మంచి స్నేహి తుడు. సున్నితమైన మనస్సు కలవాడు. చాలాకాలం తర్వాత నాతో సరదాగా గడపాలని పదిరోజులు శలవు తీసుకుని మన్య ప్రదేశం వచ్చాడు. కాని వచ్చి రెండు రోజులు కూడా ఉండలేదు. అర్జంటు పని ఏదో ఉందని శలవు పూర్తికాకముందే మన్యం నుండి తిరిగి వెళ్ళిపోయాడు.

త్యాగరాజు వెళ్ళిన నాలుగు రోజు లకు ఒక ఉత్తరం వచ్చింది. క్లినిక్ పని పూర్తిచేసుకుని సావకాశంగా త్యాగ రాజు రాసిన ఉత్తరం చదవసాగాను.

"మై డియర్ మధూ!

ఇంతవరకు నువ్వు నన్ను ఒక మంచి మిత్రుడిగా తలుస్తున్నావు. ఈ ఉత్తరం చదవటం పూర్తిచేయగానే ఆ అభిప్రాయాన్ని తప్పక మార్చుకుంటావు. అయినప్పటికి నేను చేసిన నేరాన్ని కప్పి పుచ్చి నీకు నేను ద్రోహం తలపెట్టలేను. నువ్వు పెళ్ళిచేసుకోపోటానికి కారణం నువ్వు చాలాసార్లు చెప్పావు. నేను పెళ్ళి చేసుకోపోటానికి కారణం నువ్వు అడిగి నప్పుడు నేను చెప్పలేకపోయాను. నేను రైల్వేలో టి.టి.ఇ.గా పనిచేస్తున్న విషయం నీకు తెలుసు. ఉద్యోగరీత్యా జైపూర్ వాల్తేరు మధ్య ఎక్కువగా తిరుగుతుంటాను. ఒకరోజు డ్యూటీమీద జైపూర్ నుండి వాల్తేరు వెళ్ళే రైల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు ఒక పెట్టెలో ఒంటరిగా ప్రయాణం చేస్తున్న ఒక అందమైన స్త్రీని చూసాను. అప్పటికే బాగా త్రాగివున్న నేను ఆమెమీద పడి పశువులా ప్రవర్తించాను. నాలో విషా

దిగిపోయాక గాని నే నెంత పొరపాటు చేసానో నాకు అర్థంకాలేదు. ఒక గంట తర్వాత మామూలు మనిషినైన నేను చేసిన తప్పుకు క్షమార్పణ చెప్పుకోవాలని ఆమెకోసం పెట్టె నలుమూలలా చూసాను కాని ఆమె కనబడలేదు. అంతకుముందు ఏదో చిన్న స్టేషన్‌లో రైలు కొన్ని క్షణాలు ఆగినప్పుడు ఆమె రైలు దిగి వెళ్ళిపోయిందనుకుంటాను. ఆ తర్వాత ఆ అమ్మాయి నా కంట ఎప్పుడూ పడలేదు. కాని ఆమె ఫోటోని నీ డైరీలో చూసాను. ఎందుకో ఆ ఫోటోని చూసాక అరమరిక లేకుండా నీతో మాట్లాడలేకపోయాను. ఒకనాడు రైల్లో నేను చేసిన నేరానికి శీలాన్ని కోల్పోయిన శ్రీ పి పార్వతే అన్న విషయాన్ని నీకు చెప్పలేకపోయాను. అందుకే శలవు లేదన్న సాకుతో ఆ మర్నాడు తిరుగు ప్రయాణం కట్టాను-

నీ మిత్రుడు త్యాగరాజు."

త్యాగరాజు రాసిన ఉత్తరం చదివిన తర్వాత, ఆరు సంవత్సరాల క్రిందట క్లినిక్ విడిచి పార్వతి ఎందుకు వెళ్ళిందో నేను అర్థం చేసుకోగలిగాను. ఆమె ఎక్కడకు వెళ్ళి వుంటుందో ముందు నాకు అంతుపట్టలేదు. ఆమె పదే పదే జైపూర్ సంగతులు, అక్కడున్న ఆమె తాతగారి ముచ్చట్లు చెప్పడం తలపుకొచ్చాయి. వెంటనే ప్రివ్‌లీవ్ సర్దుకుని వాల్తేరు నుండి జైపూర్ వెళ్ళే రైలు ఎక్కి జైపూర్ వెళ్ళాను. పార్వతి చెప్పిన అడ్రసు గుర్తుకు తెచ్చుకుని ఆమె తాతగారి యిల్లు చేరటానికి ఎంతో సేపు పట్టలేదు.

నా గొంతు విన్న వెంటనే తలుపు తెరుచుకుని రాకెట్‌లా దూసుకువచ్చిన పార్వతిని, ఆమె పమిటకొంగు పుచ్చుకుని చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ వచ్చిన అయిదేళ్ళ బాబును చూసాక నా మనస్సు తేలికపడింది.

చేసిన తప్పును క్షమించమని ప్రాధేయపడినట్టు మొగ్గలా ముడుచుపోయి నా పాదాలమీద ఆమె వాలిపోయింది. ఆమె ఎందుకు అలా అయిపోయిందో అర్థం కాక వింతగా నా కళ్ళలోకి చూస్తూ నిలబడ్డాడు ఆమె వెంటవచ్చిన అయిదేళ్ళ బాబు.

